# ఒసేవ్! ఏమేవ్!. . .

రవీ, మదన్‌లు చిన్ననాటి స్నేహితులు! చాలా కాలం తరవాత కలుసుకున్నారు. చిన్నప్పటి కబుర్లన్నీ చెప్పుకున్నాక, వీళ్ళ క్లాస్‌మేట్ శీనూని కలవడానికి కెళ్ళారు వాళ్ళింటికి.

"ఒసేయ్! మూడు కాఫీలు పంపించు త్వరగా" అరిచాడు శీను.

"అలాగే!" అంటూ లోపల్నుంచే సమాధానం చెప్పింది ఆవిడ. ఈలోగా ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ కూర్చున్నారు ముగ్గురు స్నేహితులు.

ఒక్క అయిదు నిమిషాలయిందో లేదో "ఒసేయ్! ఎంతసేపూ" నీ కాఫీ కాదుగానీ, మా ప్రాణాలు పోతున్నాయ్? పోనీ హోటల్ కెళ్ళి తాగమంటావేంటి?" అరిచాడు అక్కడినుంచే.

"తెస్తున్నానండీ!" అంటూ మూడు కప్పుల్లో కాఫీ పోసి తెచ్చింది ఆవిడ.

"ఇదే మా శ్రీమతి? దీని పుట్టిల్లు భీమవరం! మా మేరేజ్ అయ్యాక మీరు మమ్మల్ని చూడ్డం ఇదే మొదటిసారి అనుకుంటా? మాకో సుపుత్రుడు ఒక ఏడాదయింది ఆ గుంట వెధవకి! ఇది డిగ్రీదాకా చదువు వెలగబెట్టింది. ప్రస్తుతం ఇల్లూ, ఆ బుడతగాణ్ణీ, నన్నూ చూస్తూ ఉండడమే ఉద్యోగం.

అతనిలా పరిచయం చేస్తూవుంటే ఆమె తల వంచుకుని నేల చూపులు చూడ్డం గమనించారు రవీ, మదన్‌లు. ఒక్క నిమిషం ఆమె అలా నుంచుని తరవాత ఒస్తానండీ! లోపల పనుంది అని ఇద్దరికీ నమస్కారం పెట్టి వెళ్ళిపోయింది.

"ఒసేయ్! మన బుడతణ్ణి చూపించవే" మళ్ళీ అరిచాడు శీను.

"ఏమండీ! మీరొక్కసారి ఇలా రండి" లోపల్నుంచే పిలిచింది ఆమె.

"ఒస్తున్నానే బాబూ! నీ ఆర్డర్లూ నువ్వూనూ? నువ్వు నాకు మొగుడువై కూర్చున్నావు" అంటూ లేచి వెళ్ళాడు.

"నాకు పేరు లేదా? లక్షణంగా శ్రీదేవి అని పిలవకుండా ఒసేవ్, గిసేవ్ ఏంటీ? బాబుని కూడా బుడతడూ, గిడతడూ అంటారేంటి? 'వినోద్' అనలేరూ?

లేదా 'బాబూ' అనొచ్చుగా? ఆమె గొంతులో అవమానం, బాధ గోచరించాయి".

"మా నాన్న మా అమ్మని 'ఒసేవ్' అని పిలిచేవారు. మా మామయ్య మా అత్తయ్యని 'ఏమేవ్' అని పిలిచేవారు. అంతేకాని పేర్లు పెట్టి భార్యని పిలవడం మాకలవాటు లేదు" అన్నాడు శీను.

తరవాత ఆ అమ్మాయి గొంతు వినబడలేదు.

కాస్సేపటికి బాబుని తీసుకుని వొచ్చాడు శీను. ఇదుగో వీడే మా వాడు అంటూ చూపించాడు.

"పేరు?" అడిగాడు రవి.

"వినోద్?" చెప్పాడు శీను.

"మంచిపేరు" అన్నాడు మదన్. అప్పటికయినా ఆ మాటలు వాడి బుర్రలోకెక్కి పేరుపెట్టి పిలవడమో లేకపోతే ఏదైనా ముద్దు పేరు పెట్టి పిలవడమో చేస్తాడని!

కానీ ఇవేమీ శీను బుర్రలో కెక్కలేదు!

కాస్సేపు కూర్చుని రవీ, మదన్‌లు వెళ్ళిపోయారు.

ఒకరోజు రవి వాళ్ళ మామయ్య ఊరికి వెళ్ళాడు. ఏదో పెళ్ళికని! అక్కడ ఒకాయన పెళ్ళి వారి బంధువయియుంటాడు. అతను "ఏయ్! నిన్నే!" అని కేకపెట్టాడు. అందరూ ఎవర్నా అని తిరిగి చూశారు. అంతలోనే ఒకావిడ గబగబా లేచి "ఏమిటండీ ఆ పిలుపూ అరుపూ" అందరూ మన్నే చూస్తున్నారు అంది మెల్లగా.

"చూస్తే చూశార్లే!" అని అతి సామాన్య విషయంగా తీసి పారేస్తూ "ఏయ్! వసంతా ఇలారా" పిలాచాడు. "ఎవరో అమ్మాయిని పిలుస్తున్నాడు కాబోలని అటూ ఇటూ చూసింది ఆవిడ. ఒక నలభై ఏళ్ళ ఆవిడ లేచొచ్చింది అక్కడికి. "ఇది నా భార్య!" అని ఆమెకి పరిచయం చేసి ఇది వసంత మేము లంగోటీ ఫ్రెండ్స్‌మి!

మా నాన్నగారు దీన్ని ఎప్పుడూ "ఏమే దొంగముండా" అని పిలిచేవారు. ఎప్పుడూ పేరుతో పిలవనే లేదు!" అంటూ ఇకిలించాడు.

ఆమె సిగ్గుతో బిక్క చచ్చిపోయి తల వంచుకుంది. అతని భార్య కూడా అదోలా చూసి తలవంచుకుంది.

పందిట్లోని కళ్ళన్నీ వాళ్ళమీదే వుండి అందరూ ముసిముసిగా నవ్వుకున్నారు. రవికి ఒళ్ళు మండిపోయింది ఆ దృశ్యం చూసి.

"ఇలా మాట్లాడడం వల్ల వాళ్ళకి ప్రేమలు లేవని నేననను. కానీ ఎదుటి వారు అలా పిలవడంవల్ల అలా మాట్లాడడం వల్ల బాధపడతారేమోనన్న ఆలోచన కాస్తా కూడా వాళ్ళకుండక పోవడం ఆశ్చర్యం!" అన్నాడు రవి మదన్‌తో!

"అవును కొందరు అత్తలు కోడళ్ళనీ, తల్లులు కూతుళ్ళనీ కూడా అలాగే పిలుస్తారు. మనసులో ఎంత ప్రేమ వున్నా అది పిలుపులో కనబడకపోయేసరికి బాధపడతారు అవతలివాళ్ళు! మా అంకుల్ ఒకాయన వాళ్ళ డ్రైవర్ని ఏంరా? ఇటురారా! పోరా?" అని మాట్లాడేవారు. ఒకరోజు అతడు తిరగబడి "సార్! నన్ను అట్లా పిలవకండిసార్? నా పేరు బెట్టి పిలవండి! రాములూ అని పిలుస్తే రానా సార్!" అన్నాడు. దాంతో మా అంకుల్‌కి షాక్ కొట్టింది. ఎప్పుడూ ఇంకెవ్వరినీ అలా పిలిచేవాడు కాదు. 'ప్రేమగా ఏరా రారా' అని పిలవడం వేరు, ఆధిపత్యాన్ని చూపించుకోవడానికి అలా పిలవడం వేరు!" అన్నాడు మదన్.

"కరెక్ట్! ఈ పిలుపులతోనే తెలిసి పోతుంది ఆ వ్యక్తి, ఆ పిలిచే మనిషికి ఎంత గౌరవం ఇస్తున్నాడో!

"సాధారణంగా ఈ పిలుపులు వాళ్ళ మనస్తత్వం మీద ఆధారపడుంటాయోయ్!" అన్నాడు రవి, పెద్ద తనేదో ఈ సబ్జెక్టు మీద రిసెర్చి చేసినట్టు.

"అంటే?" అడిగాడు మదన్.

"ధనిక వర్గం వారు పేదవాడిని పిలిచినప్పుడు "ఏంరా? రారా పోరా అనడం అలాగే పురుషుడు తను స్త్రీకన్నా అధికుడు అనుకున్నప్పుడు ఒసేవ్, ఏమేవ్ అంటూ పిలవడం వాళ్ళ వాళ్ళ గొప్పతనాన్ని చాటుకోవడానికే సుమా అనిపిస్తుంది కదూ?" అన్నాడు రవి.

"అవును! ప్రతి మనిషి ఎదుటి మనిషిని గౌరవించడం నేర్చుకోవాలి! అప్పుడు ఈ పిలుపులే మారిపోతాయి! పిలుపులో తియ్యదనం కావాలి! పలుకులో ఆప్యాయత వుండాలి! అప్పుడు ఎలాపిలిచినా ఫరవాలేదు. దేముణ్ణి సయితం భక్తుడు నువ్వు అంటాడు భక్తితో తల్లినీ తండ్రినీ బిడ్డలు 'నువ్వు' అన్నా తప్పులేదు ప్రేమతో.

కానీ ఒకరిని కించపరుస్తూ తన ఆధిక్యతని చూపించాలనుకునే మనస్తత్వం మంచిది కాదు!" అన్నాడు మదన్.

అప్పుడే అక్కడికొస్తున్న శీనూ వీళ్ళ మాటలు విన్నాడేమో ఒరేయ్ రవీ మదన్ మా శ్రీదేవి అదే మా ఆవిడ రేపు ఆదివారం భోజనానికి పిలిచిందిరా! మీరిద్దరూ తప్పకుండా రావాలి! లేకపోతే నా భరతం పడుతుంది" నవ్వేడు.

"ఏమిటీ విశేషం?" అడిగాడు రవి.

"మా వినోద్ పుట్టినరోజు. ఫస్ట్ బర్త్‌డే!

"ఓ.. కంగ్రాట్స్!" అన్నాడు రవి!

"డబుల్ కంగ్రాట్స్!" అన్నాడు మదన్!

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు శీను.

"మీ ఆవిడని పేరు చెప్పి గౌరవించినందుకు?" అన్నాడు మదన్.

"వో... అదా!... ఆ రోజు మీ ముందు అలా పిలిచానని రెండ్రోజులు అలిగింది మా ఆవిడ! అప్పటికి అలా పిలవడం మానేశానోయ్! అందుకే మా శ్రీదేవికి మీరిద్దరూ అంటే గౌరవం!" అన్నాడు.

ముగ్గురు స్నేహితులూ, హాయిగా నవ్వుకున్నారు! *